సాక్షి
హనుమకొండ

బుధవారం । 25 । జనవరి । 2023



సోలార్ యూనిట్ ఏర్పాటుతో...
సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు అన్నారు.
- 8లో▸



మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
మహిళలకు అన్ని విధాలా చేయూతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి దయాకర్‌రావు అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0^0 / 17.0^0

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండతో వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు బాసరకు ప్రత్యేక బస్సులు

హన్మకొండ: బాసరకు బుధ, గురువారాల్లో టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వరంగల్‌–1 డిపో మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న వసంత పంచమిని పురస్కరించుకుని హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి 25న సాయంత్రం 6 గంటల నుంచి బాసర సరస్వతీ దేవాలయానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300గా నిర్ణయించినట్లు, భక్తుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో టికెట్ బుకింగ్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. హనుమకొండ నుంచి బాసరకు 92790 92792 నంబర్ ద్వారా రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 99592 26047, 73828 53941 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి మంగళవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో రెండు పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ ఇద్దరు విద్యార్థులు స్క్వాడ్‌లకు పట్టుబడి డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పోటీలకు కేయూ జట్టు



కేయూ క్యాంపస్: బెంగళూరులోని అలయన్స్ యూనివర్సిటీలో ఈనెల 24 నుంచి 26 వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ మహిళల ఖోఖో పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ జట్టు పాల్గొననున్నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న మంగళవారం తెలిపారు. ఈజట్టులో జి.అఖిల (మహర్షి డిగ్రీ కళాశాల ములుగు), కె.గౌరి, ఎస్.శివలీల, ఆర్.భవాని, బి.ప్రవళిక (కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల), కె.శిరీష, కె.శైలజ, టి.ప్రసన్న (కొత్తగూడెం టీటీడబ్ల్యూఆర్డీసీ ఉమెన్), పి.శిరీష (టీటీడబ్ల్యూ ఆర్డీసీ మహబూబాబాద్), కె.మేఘన (ఖమ్మం ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల), టి.ఐశ్వర్య (కేడీసీ, హనుమకొండ), ఎస్.రమ్య పింగిళి ప్రభుత్వ కళాశాల, హనుమకొండ), ఎస్.చిలకమ్మ సత్తుపెల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల) ఉన్నారు. ఈజట్టుకు కొత్తగూడెం టీటీడబ్ల్యూ ఆర్డీసీ (ఉమెన్) వ్యాయామ అధ్యాపకురాలు డి.శ్వేతా మేనేజర్‌గాను, మణుగూరు టీటీడబ్ల్యూ ఆర్డీసీ కళాశాల వ్యాయామ అధ్యాపకుడు ఎం.రాకేశ్ కోచ్‌గా వ్యవహరిస్తారని సవితాజ్యోత్స్న తెలిపారు.

ఎంజీఎంలో ఏడుగురు రేడియోగ్రాఫర్‌ల చేరిక

ఎంజీఎం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నియామకాల్లో భాగంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి నూతనంగా ఏడుగురు రేడియోగ్రాఫర్‌లు వచ్చినట్లు ఆస్పత్రి పరిపాలనాధికారులు తెలిపారు. టీఎస్‌పీఎస్‌సీ ద్వారా నియామకమైన వీరు మంగళవారం ఆస్పత్రిలో రిపోర్టు చేసినట్లు పేర్కొన్నారు. వీరి రాకతో సేవలు మెరుగుపడుతాయని అధికారులు తెలిపారు.

కోటలో విదేశీయుల సందడి



ఖిలా వరంగల్: 'కాకతీయుల నిర్మాణ శైలి, నల్లరాతిలో రూపొందించిన శిల్పకళ వెరీ బ్యూటిఫుల్' అని అమెరికా దేశస్తులు తెలిపారు. ఖిలా వరంగల్ కోటను మంగళవారం మధ్యాహ్నం విదేశీయులు సందర్శించారు. శిల్పకళా సంపదను ఆసక్తిగా తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలు, ఖుష్‌మహల్‌ను సందర్శించారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ గట్టికొప్పుల అజయ్ వివరించారు.

6,365 మందికి కంటి పరీక్షలు

ఎంజీఎం: కంటి వెలుగులో మంగళవారం హనుమకొండ జిల్లాలో 6,365 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు డీఎంహెచ్‌ఓ సాంబశివరావు తెలిపారు. ఇందులో 1,497 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా.. 786 మంది అద్దాల కోసం రెఫర్ చేసినట్లు తెలిపారు.

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి
సీపీ ఏవీ రంగనాథ్

కార్పొరేట్ సంస్థలకు సర్కార్ పెద్దపీట
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

10లో▸

'కొత్త' సాయానికి కత్తెర

రైతుబంధుపై సాంకేతికత ఎఫెక్ట్

- ఉమ్మడి వరంగల్‌లో పలువురికి చుక్కెదురు
- యాసంగి పెట్టుబడి సాయానికి గిరికీలు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- 25,499 మంది రైతులకు సాయం దూరం



సాక్షిప్రతినిధి, వరంగల్: రైతుబంధు పెట్టుబడి సాయం గత నెల 28 నుంచి విడతల వారీగా విడుదల చేశారు. ఎంత వ్యవసాయ భూమి ఉన్నా.. రైతుబంధు పోర్టల్‌లో నమోదైన ప్రతి ఒక్కరికీ పెట్టుబడిసాయం జమ చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. వానాకాలం సీజన్‌కు ముందు తర్వాత భూముల క్రయవిక్రయాలు, యాజమాన్య హక్కుల బదిలీల్లో జరిగిన మార్పులు, వారసత్వ పట్టాల మార్పిడి చేసినా చాలామందికి యాసంగి సాయం అందలేదు. కొందరికి వానాకాలం, యాసంగి పంటలకు కూడా రైతుబంధు జమవకపోగా.. ఆ అంశంపై ఇప్పటికీ స్పష్టత కొరవడింది. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నప్పటికీ పోర్టల్ మాత్రం ఇప్పటి వరకు తెరుచుకోలేదు. గడువు ముగుస్తున్నా.. నమోదు ప్రక్రియ ప్రాసెసింగ్‌లో ఉన్నట్లు చూపుతోంది. దీంతో కొత్త రైతులు ఆందోళన చెందుతున్నారు.

అందని 'బంధు'

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,62,654 మందికి 14,36,154 ఎకరాలకు సుమారు రూ.709 కోట్ల మేరకు రైతుబంధు రైతుల ఖాతాలో జమయ్యినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం మరో 25,499 మందికి 30,349 ఎకరాలకు సాయం అందాల్సి ఉంది. గత సీజన్ నుంచి ఇప్పటి వరకు క్రయవిక్రయాలు, వారసత్వంగా భూములు దక్కించుకున్న కొత్త రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేసే ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో వారికి రైతుబంధు జమకాలేదని అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి సాయం పంపిణీకి ప్రభుత్వం ప్రత్యేకంగా రైతుబంధు పోర్టల్ రూపొందించిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని నేరుగా నిక్షిప్తం చేసి ఆమేరకు నగదు జమ చేసినట్లు చెబుతున్నారు. గత వానాకాలం, ఈ యాసంగికి కూడా కొ త్త రైతులకు పెట్టుబడి సాయం అందలేదు. అధికారులు మాత్రం సాంకేతిక కారణాలు చూపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం భూములున్న రైతులందరి వివరాలు ఆన్‌లైన్ చేశామని చెబుతున్నారు.



ఈఫొటోలోని రైతు పేరు బుర్ల విష్ణుమూర్తి. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి. వానాకాలం, ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు పెట్టుబడి ఇప్పటి వరకు జమ కాలేదు. తల్లి పేరిట 9 ఎకరాల భూమి ఉండగా.. తన పేరిట వానాకాలం సీజన్‌కు ముందే రెండెకరాలు వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటికి రెండు విడతలుగా పెట్టుబడి సాయం రావాల్సి ఉండగా.. పోర్టల్‌లో సాంకేతిక సమస్య కారణమంటూ.. రైతు ఖాతాలో పెట్టుబడి సాయం జమ కాలేదు.



ఈ ఫొటోలోని రైతుది వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలగుంట. పేరు బత్తిన మహేశ్. గత వానాకాలం నుంచి రైతుబంధు రావట్లేదు. ఉమ్మడి కుటుంబంగా ఉన్న వీరికి 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతంలో ఈ భూమి తల్లి రమాదేవి పేరు మీద పట్టా ఉండేది. ఈ భూమిని వారసత్వంగా ముగ్గురు అన్నదమ్ములు సమానంగా ఎకరం చొప్పున పట్టా చేయించుకున్నారు. మిగతా ఎకరం రమాదేవి పేరు మీదే ఉంది. గతంలో నాలుగు ఎకరాలకు రైతుబంధు వచ్చింది. రిజిస్ట్రేషన్ చేయించుకుని ఏడాది గడిచినా.. రెండు పంటలకు రైతుబంధు రాలేదు.

30లోగా పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- అధికారులతో సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

విద్యారణ్యపురి: ఈనెల 30లోగా మన ఊరు–మన బడి పనుల్ని పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. మన ఊరు–మనబడి పనుల పురోగతిపై మంగళవారం హనుమకొండలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్.సంధ్యారాణితో కలిసి సంబంధిత ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో మండలాల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల్లోని ఆయా పనులు వేగవంతం చేయాలన్నారు. పనుల పురోగతి, సాంకేతిక అంశాలపై తగిన సూచనలిచ్చారు. పలు చోట్ల పనుల పురోగతి ఆలస్యం, అధికారుల తీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా పనులు చేసిన వాటికి ఎప్పటికప్పుడు ఎంబీ రికార్డు చేసి బిల్లులు ఎందుకు చెల్లించడంలేదని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ఈనెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలన్నారు. పాఠశాలల్లో పనులు పూర్తయిన వాటిలో తరగతి గదుల్లో పూర్తిగా శుభ్రం చేయించి పేయింటింగ్ కూడా ప్రారంభించాలన్నారు. ఎంబీ రికార్డు చేయని పనులకు వెంటనే ఎంబీ రికార్డు చేసి ఎఫ్‌టీఓఎస్ జెనరేట్ చేయాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన వాటిలో మోడల్ స్కూళ్లుగా 28 పాఠశాలల్లోని పనులన్నింటినీ పూర్తి చేసి ఈనెల 30 వరకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. డీఈఓ ఎండి అబ్దుల్‌హై, మన ఊరు–మనబడి కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, వివిధ శాఖల ఈఈలు నరేందర్‌రెడ్డి, రాజం, శంకర్ డీఈలు, ఏఈలు, ఎంఈఓలు, ఎంఎన్‌ఓలు పాల్గొన్నారు.

కలలకు రెక్కలు తొడుక్కుని..



విమానంలో ప్రయాణిస్తున్న కేవీ విద్యార్థిని

కాజీపేట అర్బన్: కలలకు రెక్కలు తొడుక్కుని ఆకాశంలో విహరించారు కాజీపేట మండలం కడిపికొండలోని కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థులు. సోమవారం ఏయిర్ స్క్వాడ్రన్ విమాన విన్యాసాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. మామునూరు ఏయిర్‌పోర్టులో 4వ తెలంగాణ ఏయిర్ స్క్వాడ్రన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైమానిక శిక్షణ తరగతుల్లో కేవీ పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఐదుగురు పాల్గొన్నారు. విమాన విహంగ శిక్షణ పొంది విమానంలో ప్రయాణించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరాల సందర్శన



వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌ఓ

ధర్మసాగర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు నారాయణగిరిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను మంగళవారం హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు సందర్శించారు. ఇప్పటివరకు ఒక్కో క్యాంపులో ఎంత మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంత మందికి అద్దాలు అందజేశారని వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా కంటి వెలుగు గురించి ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. మండలంలో మూడు క్యాంపులు నిర్వహిస్తుండగా.. ఇప్పటివరకు 455 మందికి పరీక్షలు నిర్వహించి 55 మందికి అద్దాలు అందజేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?

- ప్రశ్నిస్తున్న నడికూడ వాసులు
- ఇళ్లపై నుంచి 11కేవీ విద్యుత్ తీగలు



ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు

నడికూడ: కొద్ది రోజులుగా మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. పాత విద్యుత్ స్తంభాలు తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. కొన్ని చోట్ల ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. కొత్త స్తంభాలు ఏర్పాటు చేసే క్రమంలో తీగలు అలాగే వేలాడుతూ ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే మండల అభివృద్ధికి తమ ఇంటి స్థలాలు నష్టపోయామని, ఇంటి ఆవరణలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారని, తమ ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్లపై నుంచి 11 కేవీ లైన్ పోతుండగా.. మండల అభివృద్ధికి కనీసం మాస్టర్ ప్లాన్ లేకుండా పనులు చేస్తున్నారని, అధికారులు మాత్రం తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రేక్షక పాత్ర వహిస్తున్నట్లు స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి స్పందన లేదని, ఇప్పటికైనా ఎమ్మెల్యే జోక్యం చేసుకొని తమ సమస్య పరిష్కరించాలని రోడ్డు విస్తరణలో స్థలం నష్టపోయిన స్థానికులు కోరుతున్నారు.

వర్క్‌షాపుతో సంపూర్ణ అవగాహన

చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ: పీఆర్‌ఎస్ శాసన పరిశోధన సంస్థ నిర్వహించిన వర్క్‌షాపులో నిపుణులు విలువైన సమాచారాన్ని అందించినట్లు చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు. న్యూ ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో మంగళవారం రెండో రోజు జరిగిన సదస్సులో చీఫ్ విప్ వినయ్ భాస్కర్ పాల్గొన్నారు. వర్క్‌షాపు అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. ఈవర్క్‌షాపులో దేశంలోని ఆర్థిక స్థితిగతులు, వాటి అధ్యయనం, ఆర్థిక వనరులు పెంపొందించుకునే మార్గాలు, ఆరోగ్య వ్యవస్థకు వెచ్చించాల్సిన నిధులు, స్థానిక సంస్థల ప్రాముఖ్యం, ప్రాధాన్యం, వారి ఆర్థిక పరిస్థితులు, రాష్ట్రాలకు కేంద్రం అందించాల్సిన ప్రాయోజిత పథకాల ఆవశ్యకత, ఇతర అంశాలపై పూర్తి సమాచారాన్ని ఎమ్మెల్యేలకు అందించినట్లు తెలిపారు.



వాహనాన్ని బాధితులకు అందజేస్తున్న పోలీసులు (ఫైల్)



పరకాల సెంటర్‌లో సీసీ కెమెరాలు అమరుస్తున్న సిబ్బంది (ఫైల్)

సీసీ.. ప్రత్యక్ష సాక్షి

- నేరస్తుల గుండెల్లో సీసీ కెమెరాలతో వణుకు
- నేరాల నియంత్రణకు దోహదం
- వీధుల్లో, వ్యాపార స్థలాల్లో ఏర్పాటుకు పోలీసుల ప్రోత్సాహం

పరకాల: ఒకప్పుడు ఏ వస్తువు పోగొట్టుకున్నా.. చాలా వరకు దొరక్కపోయేది. కానీ నేడు సీసీ కెమెరాల పుణ్యమా అని ఎక్కడ ఏది పడిపోయినా.. చోరీకి గురైనా గంటల వ్యవధిలో దొరికేస్తోంది. మూడేళ్లుగా నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాల ఏర్పాటులో పరకాల డివిజన్ పోలీసులు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. సీసీల ఏర్పాటుకు స్థానికులు, వ్యాపారులను చైతన్యపరుస్తున్నారు. పట్టణంలోని 40 కాలనీలకుగాను 20 కాలనీల్లో సీసీ కెమెరాలు సుమారు 90కి పైగా ఏర్పాటు చేయించారు. దాదాపు అన్ని దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తూ.. వ్యాపారస్తుల సహకారంలో పరకాల పట్టణంలోని హైవేతో సహా నాలుగు ప్రధాన రహదారులపై 72 కెమెరాల ఏర్పాటు చేయించారు. ఆయా కెమెరాలన్నింటినీ పరకాల పోలీస్‌స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ సిస్టంకు లింక్ చేశారు. అక్కడ్నుంచే పోలీసు అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఏ ఘటన జరిగినా ఫిర్యాదు అందగానే నిమిషాల్లోనే కేసులను ఛేదిస్తూ సత్వరమే బాధితులకు న్యాయం చేస్తున్నారు. సీసీ ఫుటేజీల సాయంతో సెల్‌ఫోన్లు, నగదు, బంగారం, వాహనాలు పట్టుకుంటున్నారు.

డివిజన్‌లో 'సీసీ'ల సాయంతో ఛేదించిన కేసులు కొన్ని..

- 2019లో ధర్మారం వద్ద బైక్‌పై వెళ్తున్న వారిపై దాడి చేసి సెల్‌ఫోన్లు, నగదు ఎత్తుకెళ్లిన నిందితులను పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా పట్టుకున్నారు.
- 2019లో దామెర చెరువు కట్టపై ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై దాడి చేసిన దోపిడీదారులను గుర్తించి అరెస్టు చేశారు.
- 2020లో ఓ మహిళ ఆత్మహత్య చేసుకునేందుకు చలివాగు వంతెన వద్దకు చేరుకోగా.. పోలీసులు గుర్తించి ఆమెను కాపాడారు.
- 2020లో అంగడి బజార్ వద్ద ఓ వృద్ధురాలు 2 తులాల బంగారం పొగొట్టుకుంది. సీసీ ఫుటేజీలు చూసి దొంగను గుర్తించి అరెస్టు చేశారు.
- 2020లో పారిశుద్ధ్య కార్మికురాలిని ఢీకొన్న లారీని గుర్తించి కమలాపూర్ పోలీసులను అప్రమత్తం చేసి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పట్టుకున్నారు.
- 2021లో అంబేడ్కర్ సెంటర్ వద్ద ఓ వికలాంగుడిని ఇసుక లారీ ఢీకొని ముందుకు దూసుకెళ్లగా.. సీసీ ఫుటేజీతో గుర్తించారు.
- 2022లో (నలుగురు ఫోన్లు, ముగ్గురు బంగారం, మరో ఇద్దరు నగదు పొగొట్టుకున్న కేసులను సీసీ కెమెరాలతో ఛేదించారు.
- 2022 డిసెంబర్ 6న ఇంట్లో గొడవపడి పసిబిడ్డతో ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను 24 గంటల్లో సీసీ కెమెరాల సాయంతో పరకాల పోలీసులు ఆచూకీ తెలుసుకొని కుటుంబీకులకు అప్పగించారు.
- 2023 జనవరి 10న గోనెల లక్ష్మి అనే మహిళ ఇంటి నుంచి వెళ్లిపోగా.. ఏడు గంటల వ్యవధిలో ఆమెను హనుమకొండ బస్టాండ్‌లో ఉన్నట్లుగా గుర్తించి కుటుంబీకులకు అప్పగించారు.



ఇంటినుంచి పసిబిడ్డతో సహా వెళ్లిన మహిళను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీస్ అధికారులు (ఫైల్)

నేరస్తులు తప్పించుకోకుండా చర్యలు



ఇప్పటికే చాలా కాలనీల్లో సీసీ కెమెరాలున్నాయి. లేని చోట ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. ఏదైనా ఘటన జరగ్గానే బాధితులు తక్షణమే పోలీసులను ఆశ్రయించాలి. దీంతో వారికి తొందరగా పోలీసుల నుంచి న్యాయం జరిగే అవకాశం ఉంటుంది. మరిన్ని సీసీ కెమెరాలతో పాటు.. ప్రధాన రహదారిపై మైక్ సిస్టం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం.

– పుల్యాల కిషన్, పరకాల సీఐ

పద్మశాలీల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి



మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : పద్మశాలి కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ కమ్యూనిటీ హాల్‌లో మార్కండేయ రుషి జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. మార్కండేయుడి చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 31న మంత్రి కేటీఆర్ కమలాపూర్‌లో పర్యటించనున్నారని, ఈనేపథ్యంలో పద్మశాలి కుల సంఘ భవనం, మార్కండేయ గుడి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి కేటీఆర్ పర్యటనకు పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కుల సంఘ భవనం నిర్మించనున్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఆకుల సంఘం అధ్యక్షులు బైరి దశరథం, ప్రధాన కార్యదర్శి పులికంటి రాజేందర్, ఉపాధ్యక్షులు దాసి శంకరయ్య, చేరాల సారంగం, సభ్యులు వావిలాల మురళి, తౌటం సుధాకర్, వెల్ది రాము, కూచన దుర్గాప్రసాద్, ఆడెపు విజయ, అభివృద్ధి కమిటీ సభ్యులు బొప్ప శివశంకర్, మెండు రమేశ్, మార్గం భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

31న కమలాపూర్‌కు కేటీఆర్ రాక
- వివరాలు 8లో▸









పూల దారి

రంగు రంగుల పూలతో కనువిందు చేస్తున్న ఈ దారి మన గ్రేటర్ పరిధిలోనిదే. హైదరాబాద్‌–ములుగు జాతీయ రహదారి నుంచి రాంపూర్ వరకు కొత్తగా విస్తరించిన రెండు కిలోమీటర్ల రహదారిలో 'కుడా' ఆధ్వర్యంలో రూ.80లక్షలతో సెంట్రల్ లైటింగ్‌తోపాటు డివైడర్ల మధ్యలో పూలమొక్కలతో అందమైన గ్రీనరీ ఏర్పాటుచేశారు. వివిధ రకాల పూలతో రోడ్డు మరింత అందంగా కనిపిస్తోంది. అదేవిధంగా కరుణాపురం వద్ద రూ.20లక్షలతో 3 కిలోమీటర్ల మేర మొక్కలను అభివృద్ధి చేశారు.

సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా మొగిలిచెర్ల సుదర్శన్



ఖిలా వరంగల్: వినియోగదారుల సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, సీసీసీ(కన్జ్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్) సౌత్ స్టేట్ ఉపాధ్యక్షుడు, వినియోగదారుల జాతీయ అపెక్స్ కమిటీ సీసీఐ(కన్జ్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా శివనగర్‌కు చెందిన మొగిలిచెర్ల సుదర్శన్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం సీసీఐ జాతీయ బాధ్యులు డాక్టర్ అనంత శర్మ, డాక్టర్ అరుణ్‌కుమార్, దేవేంద్ర తివారి, ప్రీతి పాండ్యా, విజేంద్రప్రకాశ్ హాల్‌చల్, కైలాష్ కమౌత్ బృందం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్ర గవర్నర్‌ను కలిసి వినియోగదారుల చట్టాల్లోని లోపాలను సవరించాలని కోరుతానని సుదర్శన్ ఈ సందర్భంగా తెలిపారు. నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర కమిటీలు, సహ ఉద్యమకారులు సాంబరాజు చక్రపాణి, పల్లేపాడు దామోదర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జీపీ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

వరంగల్ రూరల్: ఉపాధిహామీ నిధులతో జిల్లాలోని గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి కలెక్టర్‌కు అందించినట్లు పీఆర్ ఈఈ గూడెం శంకరయ్య మంగళవారం తెలిపారు. 120 భవనాలకు ఒక్కోదానికి రూ.20లక్షల చొప్పున ప్రతిపాదనలు రూపొందించామని పేర్కొన్నారు.

కలప ట్రాక్టర్ బోల్తా

వర్ధన్నపేట: కలప ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కట్ర్యాల శివారులో రాయపర్తి మండలం ఊకల్లు గ్రామం నుంచి కలప లోడుతో వరంగల్‌కు వెళ్తున్న ట్రాక్టర్ మంగళవారం తెల్లవారుజామున అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ అప్రమత్తమై కిందకు దూకడంతో ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.



మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్లలో కుట్టు శిక్షణ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

కొడకండ్ల: మహిళలకు అన్ని విధాలుగా చేయూతనిస్తూ వారి ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర మండల సమాఖ్యలో మహిళలకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ప్రథమంగా కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని పాలకుర్తిలో ప్రారంభించామని తెలిపారు. రూ.5 కోట్లతో 3 వేల మంది మహిళలకు 45 రోజులపాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ట్రెనింగ్ పూర్తయిన తర్వాత పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకందించే దుస్తులు కుట్టే బాధ్యత అప్పగిస్తామని, అలాగే అర్హత కలిగిన వారికి టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రమంతా విస్తరిస్తామని అన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా మహిళలకు అత్యధికంగా రుణాలందించామని, మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబం బాగుందని తెలిపారు. అందివచ్చిన అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీనిధి రుణం ద్వారా సోలార్ పథకాన్ని ప్రారంభించారు. బాలికల దినోత్సవం సందర్భంగా మంత్రి బాలికలకు మిఠాయిలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రైతువేదికలోని కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి నిర్వహణ, కంటి పరీక్షలను పరిశీలించడంతోపాటు ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ జ్యోతి, మార్కెట్ చైర్మన్ రాము, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, సర్పంచ్, ఎంపీటీసీలు మధుసూదన్, విజయలక్ష్మి, నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

31న కమలాపూర్‌కు మంత్రి కేటీఆర్

- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్సీ



ఎంజేపీ గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

కమలాపూర్: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 31న కమలాపూర్‌లో పర్యటించనున్నట్లు హనుమకొండ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కమలాపూర్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ కమలాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. ముఖ్యంగా మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల నూతన భవనాలను, కుల సంఘ భవనాలు, కేజీబీవీ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కళాశాల భవనాలను ప్రారంభించి బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు పాఠశాలల ఆవరణలో సుందరీకరణ పనులతో పాటు మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బందోబస్తు, కాన్వాయ్, హెలిపాడ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బండ శ్రీనివాస్, డీఆర్వో వాసుచంద్ర, బీసీ సంక్షేమశాఖ అధికారి రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, తహసీల్దార్ రాణి, ఎంపీడీఓ పల్లవి, బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, దశరథం, తిరుపతిరెడ్డి, అశోక్, రవి, మల్లారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గట్టు రాంచందర్‌రావు

నయీంనగర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని పార్టీ రాజకీయ కార్యాచరణ కమిటీ సభ్యుడు గట్టు రామచందర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని వైఎస్సార్‌టీపీ కార్యాలయంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షుడు నాడెం శాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం వైఎస్సార్‌టీపీ మాత్రమేనన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి పిట్ట రాంరెడ్డి మాట్లాడుతూ త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరగనున్న వైఎస్ షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యాచరణ సభ్యులు ఏపూరి సోమన్న, నీలం రమేష్, గడిపెల్లి కవిత మాట్లాడుతూ వైఎస్సార్ తెలంగాణ పార్టీకి దివంగత మహానేత డా.వైఎస్‌ఆర్ పథకాలే ప్రచార అస్త్రాలని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడితేనే ప్రజల్లో పార్టీకి, నాయకులకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీరవెల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చల్లా అమరేందర్‌రెడ్డి, మారం రెడ్డి కొటిల్‌రెడ్డి, అప్పం కిషన్, రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశంగౌడ్, సుమిత్‌గుప్త, రాబర్ట్, సమ్మయ్య, రాములునాయక్, వెంకట్‌రెడ్డి, స్వామి, వినోద్ కుమార్, రఘు, శోభ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో యావజ్జీవ శిక్ష

రఘునాథపల్లి: లిఫ్ట్ ఇస్తానంటూ వృద్ధురాలిని ద్విచక్రవాహనంపై తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ జనగామ జిల్లా కోర్టు న్యాయమూర్తి కె.శైలజ తీర్పు వెలువరించారు. ఎస్సై వీరేందర్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోమళ్ల గ్రామానికి చెందిన ఎండి అక్బర్ 2017లో అదే గ్రామానికి చెందిన వృద్ధురాలికి బస్టాండ్ నుంచి లిఫ్ట్ ఇస్తానని నమ్మబలికి బైక్‌పై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పలుమార్లు కోర్టులో వాదనలు జరిగాయి. నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

చోరీ కేసు.. పోలీసుల అదుపులో ముగ్గురు

కురవి: మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఇటీవల మూడు ఇళ్లల్లో చోరీ జరిగిన ఘటనలో కురవికి చెందిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 20న ‘మూడు ఇళ్లల్లో చోరీ’ అనే కథనం సాక్షిలో ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు అదే కాలనీతోపాటు పక్క కాలనీకి చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, దొంగతనంలో ముగ్గురితోపాటు మరికొందరి హస్తం ఉన్నట్లు సమాచారం. పోలీసుల అదుపులో ఉన్న వారిలో మైనర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఎస్సై బి.రామునాయక్‌ను వివరణ కోరగా విచారణ కొనసాగుతోందని, రెండు రోజుల్లో కేసును ఛేదిస్తామని తెలిపారు.

వరంగల్ ఆర్టీఏలో అన్నీ సమస్యలే..

- అధికారులను నిలదీసిన వాహనదారులు



వరంగల్ ఆర్టీఏలో అధికారులను నిలదీస్తున్న వాహనదారులు

ఖిలా వరంగల్: వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో అన్నీ సమస్యలే కనిస్తున్నాయి. హోంగార్డుల మొదలు అధికారుల వరకూ ఇష్టారాజ్యమే. ఏదైనా సమస్య వస్తే మాపై అధికారిని కలవండి.. అధికారిని కలిస్తే ఆపై అధికారిని కలవాలంటూ సమాధానం చెప్పడమే తప్పా సమస్య పరిష్కారం కావడం లేదు. సమస్య చిన్నదైనా చేయి తడపనిదే పని జరిగే పరిస్థితి లేదు. పేరుకే అవినీతి రహిత సేవలు కానీ దొడ్డి దారిలో అన్ని నడుస్తున్నాయి. ఆర్టీఓ ఉన్నట్లే కానీ ఎవరూ కలువలేరూ.. సమస్య చెబుకునేందుకు సమయమూ ఇవ్వరు. దీంతో వాహనదారులు ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరగలేక సహనం కోల్పోయి మంగళవారం అధికారులను నిలదీశారు. తానేమీ చేయలేను ఆర్టీఓను కలవండి అంటూ సమాధానం చెప్పడంతో వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సేవలు కాసేపు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారుల జోక్యంతో కార్యకలాపాలు యధావిధిగా జరిగాయి. కాగా, కార్డులు పోస్ట్ చేయడం లేదని, ట్రాఫిక్ పోలీసులు కార్డు లేకపోతే వాహనం సీజ్ చేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీఓ స్థాయి అధికారి స్పందించి సమస్యలు పరిష్కారించాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు ఎస్‌ఏల సర్వీస్ బుక్స్ పరిశీలన

- డీఈఓ కార్యాలయంలో ఏడు కౌంటర్లు
- రెండు మండలాలకు ఒక్కో గెజిటెడ్ హెడ్మాసర్
- సమగ్రంగా పరిశీలించాలని డీఈఓ ఆదేశాలు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ జరగనుండడంతో హనుమకొండ జిల్లాలో టెంటేటివ్‌గా అన్ని కేటగిరీల ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను రూపొందించి అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. మరో వైపు పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్–2 హెడ్మాస్టర్లుగా పదోన్నతులు పొందబోతున్న వారి సీనియార్టీ జాబితాలో కటాఫ్ డేట్‌తో జిల్లాలోని 393 మంది స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితా ప్రకారం వారి సర్వీస్ బుక్స్‌ను పరిశీలించనున్నారు. మేనేజ్‌మెంట్ల వారీగా, కేటగిరీల వారిగా ఏ కటాఫ్ డేట్‌వారు రావాలో కూడా.. వారికి సమాచారం అందించారు. అందుకు ఆయా స్కూల్ అసిస్టెంట్లకు సమాచారం మెసేజీల ద్వారా పంపారు. అందుకు హనుమకొండలోని జిల్లా డీఈఓ కార్యాలయంలో ఏడు కౌంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని రెండు మండలాలకు ఒక్కో గెజిటెడ్ హెడ్మాస్టర్ చొప్పున ఆయా స్కూల్ అసిస్టెంట్ల సర్వీస్ బుక్స్ పరిశీలనకు బాధ్యతలను డీఈఓ ఎండి అబ్దుల్‌హై అప్పగించారు. ఈమేరకు మంగళవారం ఆయా హెడ్మాస్టర్లతో సమావేశం నిర్వహించి వారికి సర్వీస్ బుక్స్ పరిశీలన ఏయే అంశాలు పరిశీలించాలో.. కూడా పలు సూచనలు చేశారు.

సర్వీస్ బుక్స్ పరిశీలించాలి..

ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా క్షుణ్ణంగా సర్వీస్‌బుక్స్‌ను పరిశీలించాలని అందులో 40 అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. కాగా.. ఎప్పుడు నియమితులయ్యారు? ఎప్పట్నుంచి రెగ్యులర్ సర్వీస్‌లోకి వచ్చారు? స్కూల్ అసిస్టెంట్లుగా ఎప్పుడు పదోన్నతులు పొందారు? వంటి అనేక అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. రిమార్కులు రాయల్సి ఉంటుంది. ఏవైనా పొరపాట్లు జరిగితే అందుకు పర్యవేక్షణాధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరిశీలించాలని ఆదేశించారు. ఆయా స్కూల్ అసిస్టెంట్లు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని రావాల్సి ఉంటుంది. ఈనెల 25న 383 మంది స్కూల్ అసిస్టెంట్ల సర్వీస్ బుక్స్ పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో గెజిటెడ్ హెచ్‌ఎంలు డాక్టర్ బి.రాంధన్, ప్రసాద్, పట్టాభి, సుధాకర్, ఎస్‌ఎస్‌ఎం స్వామి, బి.మనోజ్ కుమార్, కుమార్ పాల్గొన్నారు.

నేడు వరంగల్ జిల్లాలో..

కాశిబుగ్గ సెంటర్: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియలో భాగంగా వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు బుధవారం ఉదయం 10.30 గంటలకు సర్వీస్ బుక్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలనకు హాజరుకావాలని డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు.

బ్రెడ్ తయారీ కేంద్రం సీజ్



అభిరుచి మిల్క్ బ్రెడ్ తయారీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

వరంగల్ అర్బన్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న అభిరుచి మిల్క్ బ్రెడ్ తయారీ కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బ్రాండ్ పేరుతో కొలతలు లేకుండా, ఫార్మాలిన్ రసాయనం ఉపయోగిస్తూ బ్రెడ్, ఇతర ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. బ్రెడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడైన హనుమకొండ లక్ష్మీపురానికి చెందిన అడ్లూరి జనార్దన్‌కు రూ.20వేల జరిమానా విధించారు. అలాగే, తయారీ కేంద్రాన్ని సీజ్ చేశారు. తనిఖీల్లో అడిషనల్ డీసీపీ రఘునాథ్ గైక్వాడ్, ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఎస్సై లవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ యూనిట్ ఏర్పాటుతో బిల్లులు తగ్గుతాయి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

హన్మకొండ: సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని.. అదనపు చార్జీల సమస్య రాదని ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. ఏసీడీ, డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించని వారు విద్యుత్ సర్వీస్ తొలగించుకోవాల్సిందేనా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సీఎండీ పైవిధంగా స్పందిస్తూ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు విద్యుత్ వినియోగదారులు డిపాజిట్ చెల్లించాల్సిందేనని, విద్యుత్ సర్వీస్ తీసుకున్నప్పుడు చేసుకునే అగ్రిమెంట్‌లో నిబంధనలు స్పష్టంగా ఉన్నాయని వివరించారు. తమకు వినియోగదారులు శత్రువులు కాదని, ఏసీడీపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో స్పందించాల్సి వచ్చిందన్నారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిబంధన–6 ప్రకారం ఏసీడీ విధిస్తున్నామని, ఏసీడీపై సందేహాలుంటే ఈఆర్‌ఓ వద్దకు వెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో 7,16,000 మంది వినియోగదారులు రూ.305 కోట్ల బకాయిలున్నారని వివరించారు. ఇలాంటి రాని బకాయిలతో సంస్థకు ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వీటిని నివారించడానికి విద్యుత్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు అదనపు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తున్నామని తెలిపారు. బకాయిల చెల్లింపునకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం విద్యుత్ సంస్థల్లో లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్ రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎం మధుసూదన్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలి

గ్రామాలను విద్యుత్ సమస్యలు లేకుండా తీర్చిదిద్దాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం నక్కలగుట్టలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఎస్ఈలు, డీఈలు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్‌తో సమీక్ష నిర్వహించారు. జిల్లాలు, డివిజన్లు, విభాగాల వారీగా ప్రగతిని సమీక్షించారు. దత్తత గ్రామాల్లో కాలిపోయిన, పనిచేయని మీటర్లు ఉండకూడదని.. డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించాలని ఆదేశించారు. డైరెక్టర్లు బి. వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి. తిరుపతిరెడ్డి, సీజీఎంలు అశోక్‌కుమార్, టి.మధుసూదన్, రాజుచౌహాన్, నిజామాబాద్ ఎస్ఈ రవీందర్, కామారెడ్డి ఎస్ఈ రమేష్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

ఏటూరునాగారం: అత్తామామ, మరిది, ఆడబిడ్డ వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం షాపెల్లికి చెందిన కుక్కల కిరణ్– కవిత(28)కు పదేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి సంతానం కలుగలేదు. దీంతో మనస్తాపానికి గురైన కిరణ్ రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి అత్తామామలు సుగుణ, మణెయ్య, మరిది రాజు, ఆడబిడ్డ లింగాల సుజాత కవితను వేధిస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 22వ తేదీ తెల్లవారుజామున పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కవిత సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి తుర్రి సునంద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఉపాధ్యాయురాలు దేవిక సస్పెన్షన్

కాశీబుగ్గ సెంటర్/రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు(స్కూల్ అసిస్టెంట్) అంబటి దేవికను సస్పెండ్ చేసినట్లు డీఈఓ వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవిక ఈ నెల 20న కారణం లేకుండా 7వ తరగతి విద్యార్థులను కొట్టడంతో తీవ్ర గాయాలైనట్లు పాఠశాల హెచ్‌ఎం, ఇతర సిబ్బంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారని, విచారణ అనంతరం ఆమెను సస్పెండ్ చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు. అలాగే, నెక్కొండ మండలం వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు(ఎస్‌జీటీ) ఎం.వీరన్న పనివేళల్లో నిద్రిస్తున్నాడని పత్రికల్లో రావడంతో షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యం ప్రదర్శించాలి



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి

మడికొండ: శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని ఉద్యోగ నిర్వహణలో ఆచరించాలని మహిళా శిశు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆర్జేడీ ఝాన్సీలక్ష్మీబాయి అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా.. మడికొండ శివారు దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో డీడీయూ–జీకేవై ఆధ్వర్యంలో (యంపీహెచ్‌డబ్ల్యూ) శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో జాతీయ ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మీలో ఓర్పు, సహనంతో అందరికీ సేవ చేయాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కిట్లు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ప్రాంగణ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలకు..

- అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అశ్విని తానాజీ

కరీమాబాద్: బాలికలు చిన్నతనం నుంచే పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, దీనికి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో అవసరమని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల చూపుతున్న వివక్షను రూపుమాపాలని, అసమానతలను పారదోలాలని సూచించారు. బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. వారికి మరిన్ని అవకాశాలు కల్పించినట్లయితే ముందంజలో ఉంటారన్నారు. బాలికలు ధైర్యంగా ఉంటే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనవచ్చన్నారు. జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలికలకు ప్రత్యేకంగా ‘బేటీ బచావో–బేటీ పడావో’ పథకం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలు అమలు చేస్తూ బాలికల భవిష్యత్‌కు భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. కాగా.. కేజీబీవీ గీసుగొండ, పర్వతగిరి మోడల్ స్కూల్, నర్సంపేట సంజీవని ఆశ్రమంలో విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించగా.. విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, సభ్యులు రామలీల, మధు, షహేదాబేగం, సుజాత, సీనియర్ అసిస్టెంట్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, సీడీపీఓ విశ్వజ, ఏసీడీపీఓలు వింధ్య, హేమలత, భరోసా సీఐ స్వర్ణలత, ప్రొటెక్షన్ అధికారులు రాజు, సరిత, సురేష్, సాగరిక, శ్రీలత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన



శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీవత్స

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు పరీక్ష శిబిరాన్ని అదనపు కలెక్టర్ కోట శ్రీవత్స మంగళవారం పరిశీలించారు. పరీక్షల తీరును వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కాగా.. జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరం అసౌకర్యంగా ఉందని, ఒకే గది, వరండా కేటాయించారని, మెట్లు ఎత్తుగా ఉన్నాయని, 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆవరణలో ఆటల పోటీలు నిర్వహిస్తుండటంతో ఇబ్బందికరంగా ఉందని వైద్యులు, సిబ్బంది ఆయన దృష్టికి తెచ్చారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి, మున్సిపల్ ఎండ మాలజిస్టు స్పెషల్ ఆఫీసర్ మాధవరెడ్డి శిబిరాన్ని సందర్శించారు. అంతకుముందు మండల స్పెషల్ ఆఫీసర్ మురళీధర్‌రెడ్డి గీసుకొండలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మొగిలిచర్ల వైద్యాధికారి జి.పల్లవి, సీహెచ్‌ఓ బి.మధుసూదన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.